సాక్షి వికారాబాద్

సోమవారం, 6, మే, 2024



ఆదాయం మెండు

మామిడి పూత, కాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని..కార్బన్ ఉపయోగంచని మామిడి తినాలని వైద్యులు తెలిపారు. 8లో▸



ప్రయోజనమేనంటా!

పంట పొలాల్లో వర్షపునీటిని నిల్వ చేసేందుకు నీటికుంటల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 8లో▸



తయారీ కరువు

వ్యర్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేసి జీపీలకు ఆదాయం సమకూరేలా గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 9లో▸

న్యూస్‌రీల్

నేటి కాంగ్రెస్ సభ వాయిదా

తాండూరు: తాండూరు పట్టణంలో ఈరోజు నిర్వహించాల్సిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభ వాయిదా పడింది. ఈ సభకు ఆ పార్టీ అగ్రనాయకురాలు ప్రియాంకాగాంధీ హాజరవ్వాల్సి ఉండగా బిజీ షెడ్యూల్ కారణంగా ఆమె రాలేకపోవడంతో సభను వాయిదా వేసినట్లు ఆ పార్టీ నేతలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా వారం రోజుల నుంచి ఆపార్టీ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఇతర నేతలు సభ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు. అగ్రనేతల కోసం చాపర్లను సైతం బుక్ చేశారు. పట్టణంలోని విలియంమూన్ పాఠశాల మైదానంలో బహిరంగ సభావేదికను కూడా సిద్ధం చేశారు. అయితే ఇతర రాష్ట్రాల్లో ప్రియాంకగాంధీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండటంతో ఈనెల 10వ తేదీన తాండూరు పర్యటనకు సమయం కేటాయించారు. ఆరోజు జరిగే సభకు జిల్లా నుంచి సుమారు 2 లక్షల మందిని తరలించేందుకు నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.6వేల పెన్షన్ ఇవ్వాల్సిందే: వీహెచ్‌పీఎస్



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలరావు

అనంతగిరి: అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు వెంటనే రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు డిమాండ్ చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వీహెచ్‌పీఎస్ జిల్లా ముఖ్యనేతల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు దాటినా ఇప్పటివరకు దివ్యాంగుల పెన్షన్ పెంపు విషయమై ఏ ఒక్క కాంగ్రెస్ మంత్రి మాట్లాడటం లేదన్నారు. దీనిని నిరసిస్తూ మే 15 నుంచి 31వరకు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తారన్నారు. తదనంతరం జూన్ 1న హైదరాబాద్‌లో వికలాంగుల గర్జన నిర్వహించి 6వేల పెన్షన్‌ను సాధించుకుందామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బీజేపీకి.. వీహెచ్‌పీఎస్ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ఉపాధ్యక్షుడు ఆనందం, జిల్లా అధ్యక్షుడు శ్యాం ప్రసాద్, విజయ్‌కుమార్, రాజు, జర్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొండాను గెలిపించండి

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్, పక్కన విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని ఇందిరాచౌక్ సర్కిల్‌లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో రాజాసింగ్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వేలకోట్ల స్క్యామ్‌లకు పాల్పడిందని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ ఇద్దరూ ఎన్నికల తర్వాత జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌కుమార్, సాహు శ్రీలత, నాయకులు బంటారం భద్రేశ్వర్, పాండు తదితరులున్నారు.

మెజార్టీ నిలుపుకొంటేనే విజయం వెంటే

- అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ పరిధిలో బీఆర్‌ఎస్‌కే మెజార్టీ
- ఏడు శాసనసభ స్థానాల్లో నాలుగింటిలో ఆ పార్టీకే అనుకూల ఫలితాలు
- జిల్లాలోని మూడుచోట్ల ఎదురు దెబ్బ
- ఆ పార్టీ నేతలకు సవాల్‌గా మారిన లోక్‌సభ ఎన్నికలు



వికారాబాద్: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు గులాబీ నేతలకు జీవన్మరణ సమస్యగా మారాయనే చెప్పవచ్చు. జిల్లాలో ఐదేళ్ల పాటు నిలదొక్కుకోవాలంటే బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు తప్ప వేరే గత్యంతరం కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి మరో వారం రోజులు మాత్రమే సమయం ఉండటంతో జిల్లాలోని ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు ఎమ్మెల్యే స్థానాలను చేజార్చుకున్న గులాబీ పార్టీకి ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు అనివార్యంగా మారింది. ఇప్పటికే అధికార కాంగ్రెస్‌కు జిల్లాలో తిరుగులేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో త్వరలో జరగనున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓడితే ప్రభుత్వ అధికారిక కార్యకలాపాలకు పూర్తిగా దూరం కావాల్సి ఉంటుంది. అంతేకాకుండా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కింది స్థాయి క్యాడర్ మరింత గడ్డు పరిస్థితి ఎదుర్కోవాల్సి ఉంటుంది. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గులాబీ ఓటర్లే టార్గెట్‌గా వ్యూహాలకు పదును పెడుతున్నాయి. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో సాధించిన ఓట్లను బీఆర్‌ఎస్ నాయకులు నిలుపుకోవడమే ఇప్పుడు పెద్ద సవాల్‌గా మారింది.

అదే మెజార్టీ వస్తే..

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మెజార్టీ సాధించింది. వికారాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే మూడు నియోజకవర్గాలైన తాండూరు, పరిగి, వికారాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ వచ్చింది. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందిన నాలుగు చోట్ల కలిపి వారికి 1,05,236 ఓట్ల మెజార్టీ వచ్చింది. కాంగ్రెస్ విజయం సాధించిన మూడు నియోజకవర్గాల్లో హస్తం పార్టీకి 4,31,68 ఓట్ల మెజార్టీ వచ్చింది. ఈ లెక్కన చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపితే కాంగ్రెస్ కంటే బీఆర్‌ఎస్‌కు 62,068 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. ఈ గణాంకాలను పార్లమెంట్ ఎన్నికల్లో నిలుపుకోగలిగితే గెలుపు ఖాయమని బీఆర్‌ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక బీజేపీ ఏడింట రెండు నియోజకవర్గాల్లో రెండో స్థానంలో నిలవగా మిగతా ఐదు స్థానాల్లో మూడో స్థానంతో సరి పెట్టుకుంది. అయితే ఓటర్ల సంఖ్య అధికంగా ఉండే అర్బన్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ రెండో స్థానంలో నిలవటంతో పాటు ఈ ఎన్నికల్లో అనుకూల వాతావరణం కనిపిస్తుండటం వారికి సానుకూల అంశంగా కనిపిస్తోంది.

చిత్తశుద్ధి సాధ్యమేనా?

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, కొప్పుల మహేశ్‌రెడ్డి, పైలెట్ రోహిత్‌రెడ్డి ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో చావో రేవో అన్న తరహాలో ప్రచారం నిర్వహించిన ఈ ముగ్గురు మాజీలు ఈ ఎన్నికల్లో ఆ స్థాయిలో ప్రచారంలో పాల్గొనడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ చేవెళ్ల అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ పేరును ప్రకటించిన నెల రోజుల వరకు కూడా ప్రచారంలో వీరు పెద్దగా కనిపించలేదనే చెప్పవచ్చు. వీరు క్షేత్రస్థాయికి వెళ్లకుండా సభలు, సమావేశాలు, రోడ్ షోలకే పరిమితం కావటం కూడా విమర్శలకు తావిస్తోంది. అయితే వారం రోజులుగా ప్రచారంలో కాస్త ఊపు పెంచినప్పటికీ మిగతా ప్రధాన పార్టీలతో పోటీ పడలేక పోతున్నారనే విమర్శలు ఆ పార్టీ నాయకుల నుంచే వినిపిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పోలైన ఓట్లు ఈ ఎన్నికల్లోనూ దక్కించుకోవడం వారి ముందు ఉన్న సవాల్‌గానే చెప్పవచ్చు. లేదంటే కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డితో వారు సన్నిహితంగా ఉంటున్నారనే ఆరోపణలకు బలం చేకూరుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇదిలా ఉండగా చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మెజార్టీ సాధించకుంటే ఆ పార్టీ స్థానిక నాయకులకు అధినాయకత్వం నుంచి అధికారిక కార్యలాపాలకు ఆహ్వానం ఉండకపోవచ్చనే ప్రచారం నడుస్తోంది.

సోషల్ పొలి‘ట్రిక్స్’

క్షణంలో పాపులారిటీ పొందాలంటే ఒకే ఒక్క సులువైన మార్గం సోషల్ మీడియా. అందులోనూ ఎలక్షన్ టైం ఇక చెప్పేదేముంది. నేతలు పెడుతున్న పోస్టులు రాజకీయ వేడిని రగిలిస్తున్నాయి. విమర్శలు కాస్తా వ్యక్తిగత దూషణల వరకూ వెళ్తున్నాయి. ఇదీ జిల్లాలోని పరిస్థితి.



- బీజేపీ, కాంగ్రెస్ నేతల విమర్శలు.. ప్రతివిమర్శలు
- గ్రామస్థాయి నుంచి లోక్‌సభ స్థాయి వరకు వాట్సాప్ గ్రూపులు
- తిట్ల పురాణానికి ప్రాధాన్యం
- వ్యక్తిగత దూషణలు సరేసరి

తాండూరు: జిల్లాలో రాజకీయాలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి. ఓ వైపు ఒకే పార్టీ నుంచి ఇద్దరు నేతలు ఎంపీలుగా గెలిచిన వారు లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్, బీజేపీ నుంచి బరిలోకి దిగారు. అందులో భాగంగా సోషల్ మీడియా వలంటీర్లు పెట్టిన పోస్టులకు ఎన్ని వ్యూస్ వచ్చాయి.. ఎంత మంది చూశారు అంటూ రోజూ తెలుసుకుంటున్నారు. అయితే గ్రామ పంచాయతీ నుంచి పట్టణం, జిల్లా, పార్లమెంట్ వరకు వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. ఒకరిపై మరొకరు పరస్పరం విమర్శలు ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సోషల్ మీడియా టీమ్ వీడియోలు పోస్టు చేస్తుంది. ఇదే స్థాయిలో కాంగ్రెస్ అభ్యర్థిపై వాట్సాప్‌పై కొండా టీమ్ కూడా విమర్శలు గుప్పిస్తూ కౌంటర్‌గా వీడియోలను పోస్టు చేస్తుంది.

పార్టీలు ప్రోత్సహించడంతో..

ప్రధాన పార్టీలకు చెందిన సోషల్ మీడియా సైనికులను ఇరు పార్టీలకు చెందిన నేతలు మరింత ప్రోత్సహించడంతో వాట్సాప్‌లో విమర్శలు చేసుకునే స్థాయి నుంచి వ్యక్తిగత దూషణల వరకు వెళ్లిపోయింది. అది కూడా పూర్తిగా తిట్ల పురాణాన్నే సాగిస్తున్నారు. కాగా, వ్యక్తి గురించి కాకుండా వ్యవస్థ గురించి విమర్శలు చేసుకునే వారు ఇది గతం. ప్రస్తుత రాజకీయాలు భిన్నంగా మారాయి. సోషల్ మీడియాలో పెడ్తున్న పోస్టులు చూడాలంటేనే నెటిజన్లకు విసుగుపుట్టించేలా మారిపోయాయి. మరోవైపు బీఆర్‌ఎస్ శ్రేణులు సోషల్ మీడియాకు ఈ సారి దూరంగా ఉన్నారు. పోస్టులు పెద్దగా కనిపించడం లేదు. సైలెంట్‌గా తమ పార్టీ అభ్యర్థి తరఫున ప్రచారం చేస్తున్నారు.



పెద్దేముల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి
- ముమ్మరంగా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

పెద్దేముల్: చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రం అప్పులపాలైందన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. హస్తం గుర్తుకు ఓటువేసి రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందాం అని కోరారు. ఈ సందర్భంగా తింసాన్‌పల్లిలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్ష్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, నాయకులు.. ఎల్. నర్సింహులు, శోభరాణి, డీవై నర్సింహులు, గోపాల్‌రెడ్డి, బిచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

యువత కాంగ్రెస్ వైపే..

పరిగి: యువత కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు ఆదివారం పరిగిలోని టీఆర్‌ఆర్ నివాసంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీలను చూసి భయపడుతున్నారు

ధారూరు: కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీలను చూసి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు భయపడుతున్నాయని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. ధారూరు మండలంలోని ఎబ్బనూర్‌లో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని పేర్కొన్నారు. చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి తనయుడు గడ్డం ఆర్యన్‌రెడ్డి మాట్లాడుతూ.. చేవెళ్ల లోక్‌సభ పరిధిలో ఆరు గ్యారెంటీలు మీ ఇంటికి చేరేలా చేయిస్తా.. చెయ్యి గుర్తుకు ఓటేసి మానాన్నని గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలను విమర్శలను తిప్పికొట్టాలన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ పని అయిపోయిందన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి భరత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం తెచ్చింది కాంగ్రెస్సే..

పూడూరు: పేదల కడుపు నింపాలనే ఆలోచనతో అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి హామీ పథకం తీసుకువచ్చిందని డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కడుమూరులో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మాయమాటలు, అంకెలగారడీ తప్ప పేదల సంక్షేమం పట్టించుకోలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు పెంటయ్య, షకీల్, మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా లోక్‌సభ ఎన్నికలు

- కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకుడు రాజేంద్రకుమార్
- జిల్లాలోని పోలింగ్ కేంద్రాల పరిశీలన



అనంతగిరి: ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న రాజేంద్రకుమార్ కటారియా

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకుడు రాజేంద్ర కుమార్ కటారియా అన్నారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతితో కలిసి ఆదివారం ఆయన వికారాబాద్ జిల్లాలో పర్యటించారు. ముందుగా వికారాబాద్ మండలం సిద్దులూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 122, 123 పోలింగ్ స్టేషన్, వికారాబాద్‌లోని సంగం లక్ష్మీ బాయి హైస్కూల్ నందు 137–140 వరకు ఉన్న పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అనంతరం మెరినాట్ స్కూల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వికారాబాద్ జెడ్పీహెచ్‌ఎస్ నందు ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమ్, సువిధ, సీవిజిల్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ కేంద్రం తదితర విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్.. ఎన్నికల విధులు, పోలింగ్ పర్సనల్స్ ట్రైనింగ్, ఓటర్ల సమాచారం, జిల్లాకు సంబంధించిన పూర్తి వివరాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాజేంద్రకుమార్ కటారియా వివరించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్డీఏ శ్రీనివాస్, డీపీఆర్‌ఓ చెన్నమ్మ, ఎన్నికల విభాగం సూపరిటెండెంట్ శ్రీనివాస్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ ఏర్పాట్లు చేయండి

తాండూరు టౌన్: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని తాండూరు నియోజకవర్గంలో ఆదివారం ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేంద్రకుమార్ కటారియా పర్యటించారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతితో కలిసి పట్టణంలోని సెయింట్ మార్క్స్ పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంను ఆయన పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ నంబర్‌వన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించారు. పోలింగ్ రోజున ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డబుల్ ఓట్ల వివరాలు, వాటిపై తీసుకున్న చర్యలు, ఓటరు స్లిప్పుల పంపిణీ తదితర వివరాలను బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

పెద్దేముల్ మండలంలో..

పెద్దేముల్: పెద్దేముల్ మండలం కందనెల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకుడు రాజేంద్రకుమార్ కటారియా, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని ఓటర్ల వివరాలను తహసీల్దార్ కిషన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏర్పాట్లపై సమీక్షించారు. పోలింగ్ రోజున అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ రాజ్ అధికారి శంకర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

సౌకర్యాలపై ఆరా..

పరిగి: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరపుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకుడు రాజేంద్రకుమార్ అన్నారు. పరిగి జెడ్పీహెచ్‌ఎస్ నంబర్-2లో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్, ఈవీఎం స్ట్రాంగ్‌రూంను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డితో కలసి ఆదివారం ఆయన పరిశీలించారు. అక్కడి సిబ్బందితో సౌకర్యాలపై ఆరాతీశారు. పోలింగ్ రోజు జాగ్రత్తగా విధులను నిర్వహించాలని ఏమైనా సందేహాలుంటే ఉన్నతాధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని.. అలా ఉండే అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సామాజిక వర్గానికి పదవులివ్వండి

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పని చేస్తున్న బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు కార్పొరేషన్లలో చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇవ్వాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస రావు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు గతంలో పార్టీ అధికారంలో లేనప్పటికీ ఇబ్బందులు ఎదుర్కొని పార్టీలోనే నిస్వార్థంగా సేవ చేశారని అన్నారు. అలాంటి వారిని గుర్తించి పదవులు ఇచ్చి న్యాయం చేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీనికి ముఖ్యమంత్రి స్పందించి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో స్వరూప్‌రాజ్, సిరివోలు చక్రధర్ ఉన్నారు.



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు

రైతు రుణమాఫీపై మాట మార్చారు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

మర్పల్లి: అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆగస్టు 15లోపు చేస్తామని మాట మార్చడం ఏంటని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రశ్నించారు. మర్పల్లిలోని ఎంసీఎం ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ నేతల, కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అమలు సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు సబితారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్, మాజీ ఎమ్మెల్సీ స్వామిగౌడ్, బీఆర్‌ఎస్ యువ నాయకులు కార్తీక్ రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వైస్ ప్రెసిడెంట్ రాచన్న, అశోక్, రమేష్‌మిత్ర, యూత్ ప్రెసిడెంట్ మధుకర్, రైతు బంధు మండల అధ్యక్షుడు నాయబ్‌గౌడ్, సహకార సంఘం డైరక్టర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, వేదికపై కాసాని, బీఆర్‌ఎస్ నేతలు

దేశానికి బీజేపీ ప్రమాదకరం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం పదేళ్లుగా చేసిందేమీ లేదని, దేశానికి బీజేపీ చాలా ప్రమాదకరమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. ఇబ్రహీంపట్నంలోని పాషానరహరి స్మారక కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మతతత్వ బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మోదీ సినిమా చూపిస్తారన్నారు. నిజాం షుగర్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్, వరంగల్ కోఆపరేటివ్ మిల్లు, పసుపు బోర్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం పూర్తిగా అవినీతి మయమైందని ఆరోపించారు. లోపభూయిష్ట నిర్మాణం నిరుపయోగం కానుందని, దీని బాధ్యత పూర్తిగా బీఆర్‌ఎస్‌దేనన్నారు. దళితులను వంచన చేసి అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టాలని బీజేపీ యోచిస్తోందని దుయ్యబట్టారు. పేద ప్రజల కోసం భవిష్యత్తులో కాంగ్రెస్‌పై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. చట్టసభల్లో నిజమైన ప్రతిపక్ష శక్తి ఉండాలంటే భువనగిరి నుంచి సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.జంగారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జగదీశ్, సామేలు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంటి వద్దే ఓటువేసే సౌలభ్యం

ఓటేసిన వృద్ధులు



అంతారం గ్రామంలో ఓటరుతో అధికారులు

కుల్కచర్ల: ఎంపీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆదివారం కుల్కచర్ల మండల పరిషత్‌లో ఇంటి వద్దే ఓటు వేసేవిధంగా ఏర్పాట్లు చేశారు. అంతారం గ్రామంలో కావాలి చిన్న బసయ్య, ముజాహిద్‌పూర్‌లో ఉప్పు చంద్రప్ప, పుట్టపహడ్‌లో ఆర్.వెంకట్రాములు, మందిపల్‌లో గురుకుంట గౌరమ్మ, అడవివెంకటాపూర్‌లో మూడవత్ లక్ష్మి ఐదుగురు తమ ఓటుహక్కుని వినియోగించుకున్నారు. ఈ ఓటింగ్ ప్రక్రియలో ఎంపీడీఓ రామకృష్ణ నాయక్, ఎంఈఓ హబీబ్ అహ్మద్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ లింగయ్య, ఉద్యోగులు నర్సింహరెడ్డి, లక్ష్మిదేవి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు స్వరూప, ఎల్లమ్మ, ఆనంద్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్



పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

అనంతగిరి: వికారాబాద్‌లో నీట్ ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5.20గంటల వరకు ఈ పరీక్ష కొనసాగింది. వికారాబాద్‌లో నాలుగు సెంటర్లలో భాష్యం, భృంగీ, నాగార్జున, సెయింట్ ఆంథోని స్కూళ్లలో పరీక్ష జరిగింది. మొత్తం 1,148మందికిగాను 1,118 మంది హాజరవ్వగా 30మంది గైర్హాజరయ్యారని వికారాబాద్ కోఆర్డినేటర్ కుమారస్వామి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతుడు కృష్ణ

మొయినాబాద్: వ్యవసాయ బోరు వద్ద మోటార్ ఆన్ చేయడానికి వెళ్లిన రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కనకమామిడిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనకమామిడి గ్రామానికి చెందిన కంచె కృష్ణ(40) తనకున్న కొద్దిపాటి పొలంతోపాటు అదే గ్రామానికి చెందిన గూడూరి విఠలయ్య పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న పొలంలో వరి పంట సాగుచేశాడు. ఆదివారం ఉదయం కొడుకు జశ్వంత్‌ను తీసుకుని వరిచేనుకు నీళ్లు పెట్టడానికి వెళ్లాడు. స్టార్టర్ వద్దకు వెళ్లి మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కృష్ణకు కరెంట్ షాక్ తగిలింది. అతను కింద పడిపోగానే కొడుకు పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి చూశారు. వెంటనే ఆయనని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని భార్య లావణ్య పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగు పడి తాటిచెట్టు దగ్ధం



మంటలకు కాలిపోతున్న తాటిచెట్టు

యాచారం: మండలంలోని తమ్మలోనిగూడలో ఆదివారం సాయంత్రం తాటిచెట్టుపై పిడుగు పడింది. పలు గ్రామాల్లో సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన స్వల్ప వర్షం కురిసింది. అదే సమయంలో తమ్మలోనిగూడ గ్రామంలో రైతు దెంది రాంరెడ్డి పొలంలో తాటిచెట్టుపై పిడుగు పడి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో సమీప పొలాల వద్ద ఉన్న రైతులు భయాందోళనకు గురై పరుగులు తీశారు.

మామిడి ఒరుగుతో ఆదాయం మెండు

- ఉపాధికి ఊతం
- పల్లెల్లో జోరుగా తయారీ
- ఇంటి వద్దే పని



మామిడి ఒరుగు తీస్తున్న కూలీ



కొత్తపల్లి గ్రామంలో ఒరుగు తీస్తున్న మహిళలు

కుల్కచర్ల: ఇంటికి శుభ సూచకంగా మామిడి కొమ్మలను తోరణాలుగా ఉపయోగించడం పరిపాటి. మామిడి కాయలు, పళ్లతో ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మానవ జీవితంలో అధిక ప్రాధాన్యత గల ఒక మధుర ఫలంగా మారింది. అటువంటి ఫలం నోరూరిస్తూ కడుపు నింపడంతో పాటుగా ఇంటి దగ్గరే ఉపాధిని కల్పిస్తూ పేద ప్రజలకు మెండైన ఆదాయం ఇస్తుంది. ముఖ్యంగా పల్లెల్లో మామిడి కాయల ద్వారా ఒరుగును తయారు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. పట్టణాలలో మామిడికి మంచి డిమాండ్ ఉంది. చింతపండుకు బదులుగా పట్టణాలలో మామిడి ఒరుగును ఉపయోగించుకుంటూ వంటలు చేస్తుంటారు.

తోటల్లో, చెట్లను కొనుగోలు చేసి...

గ్రామీణ ప్రాంత ప్రజలు యాసంగి పంటలు పూర్తయిన అనంతరం పెద్దగా పనులు లేక ఇంటిదగ్గరే ఉంటారు. అటువంటివారికి వేసవిలో మామిడి కాయల వల్ల ప్రత్యేక ఉపాధి లభిస్తుంది. కొంతమంది మామిడి ఒరుగు తీసేందుకు మామిడి తోటలను, చెట్లను కొనుగోలు చేసి గ్రామాల్లో ఇంటి దగ్గర ఉన్న మహిళలకు కూలి చెల్లించి తయారుచేయిస్తారు. కుల్కచర్ల, కొత్తపల్లి, కామునిపల్లి, పీరంపల్లి, ముజాహిద్‌పూర్, చౌడాపూర్, మందిపల్, కల్మన్ కాల్వ, బండవెల్కిచర్ల తదితర గ్రామాలలోని ప్రజలు అత్యధికంగా మామిడి ఒరుగును తయారు చేసి ఉపాధి పొందుతున్నారు.

ఇంటి వద్దే తయారీ..

మామిడి ఒరుగు తయారీ వల్ల నిర్వాహకులకు అధిక ఆదాయం రావడంతో పాటుగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం అదనపు ఆదాయం పొందుతున్నారు. మామిడి ఒరుగుకు మార్కెట్‌లో ఒక క్వింటాలుకు సుమారుగా రూ. 20 నుంచి 25వేల వరకు ధర పలుకుతుంది. సాధారణ రకం మామిడి ఒరుగుకు రూ.16 నుంచి 20వేల వరకూ ధర పలుకుతుంది. ఇక రోజువారీగా ఒరుగు తయారుచేసే వారికి మహిళలకు రోజుకి రూ. 200 నుంచి 300ల వరకు కూలి లభిస్తుంది. అసలే ఎండకాలం రోజు రోజుకు పెరుగుతున్న ఎండలకు ఇతర పనులు చేసేందుకు వీలుకాదు. అలాంటి వారికి ఇంటిపట్టునే ఉపాధి పొందేందుకు మామిడి ఒరుగు గ్రామీణ ప్రజలకు ఉపయోగకరంగా నిలుస్తుంది. మామిడి ఒరుగు తీయడం వల్ల లభించే మామిడి పీసులకు సైతం అధికంగా డిమాండ్ ఉంది. మామిడి పీసులకు ఒక క్వింటాలుకు ప్రస్తుతం 5 నుంచి 8వేల వరకు ధర పలుకుతుంది. వ్యాపారులు స్వయంగా రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత సంవత్సరం మామిడి పీసులకు గిరాకి తగ్గినట్లుగా కనిపిస్తుంది.



ఎండబెట్టిన ఒరుగు

నీడ పట్టున పని



ఇంటి దగ్గర ఉంటూ మామిడి ఒరుగు తీయడం వల్ల ఉపాధి లభిస్తుంది. ఎండలకు ఇంతర ప్రాంతాలకు వెళ్లి పనిచేయడానికి ఇబ్బంది ఉండడంతో నీడపాటున పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాం. ఆయా పనులతో పాటుగా ఒరుగు తీయడం వల్ల అధిక ఆదాయం సమకూర్చుకోవచ్చు.

– జంబుల నర్సమ్మ

కొనుగోలు కేంద్రాలతో సౌలభ్యం



మామిడి ఒరుగును కొనుగోలు చేసేందుకు పట్టణాలకు వెళ్లాల్సివస్తుంది. తోటలను కొనుగోలు చేయడం, మామిడి పళ్లు కోయించడం, ఒరుగు తీయించడం వంటివి ఖర్చుతో కూడుకున్న పని. ఇక్కడ తీసిన వాటిని పట్టణాలకు వెళ్లి విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అందుబాటులో కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేస్తే సౌలభ్యంగా ఉంటుంది.

– ఎల్ల శ్రీనివాసులు, కొత్తపల్లి

మామిడి పీసులకు మద్దతు ధర ఇవ్వాలి

ఒరుగు చేయించే ప్రాంతాలకు వెళ్లి వాటిని సేకరించి విత్తన కేంద్రాలకు, నర్సరీ తయారి కేంద్రాలకు, కొన్ని కంపెనీలకు, పెద్ద మార్కెట్లకు మామిడి పీసులను అమ్ముతుంటాం. ప్రస్తుతం వాతావరణ ప్రభావంతో మామిడి పీసులకు ధర పడిపోయింది. మార్కెట్లో ఎవ్వరు కూడా కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబర్చడం లేదు. ప్రభుత్వం ఈ విషయంలో మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలి.

– ఇప్పపల్లి పాండు, మామిడి పీసుల వ్యాపారి

మండుతున్న ఎండలు

ఉపశమనం కోసం తంటాలు



మిద్దెపై నీటిని చల్లుతున్న గ్రామస్తుడు

కొడంగల్ రూరల్: రోజురోజుకు ఎండలు పెరుగుతున్నాయి. ఉదయం 10గంటల నుంచే భానుడు నిప్పులు కక్కుతున్నాడు. సూర్య తాపానికి తట్టుకోలేక కొందరు గ్రామస్తులు ఉపశమనం కోసం నానా తంటాలు పడుతున్నారు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన తుంకిమెట్ల రాజు ఉపశమనం కోసం మిద్దెపై పైప్‌తో నీటిని చల్లుకుంటున్నాడు. వడ గాల్పులతో ఎండ తీవ్రత అధికంగా ఉందని, ఇంట్లో వేడి గాలితో తీవ్ర ఇబ్బందులు గురవుతున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ఇంటిపైన బోరు మోటారుతో నీటిని చల్లడంతో కొంత మేర చల్లదనాన్నిస్తుందన్నారు.

రథోత్సవంలో మళ్లీ రచ్చ



ఉత్సవాల్లో నేతల మధ్య తోపులాట

నేతల మధ్య తోపులాట

తాండూరు: తాండూరు పట్టణంలోని భావిగి భద్రేశ్వర దేవాలయ జాతరోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవాలలో మరోసారి రాజకీయ నేతల మధ్య తోపులాట జరిగింది. శనివారం అర్ధరాత్రి నిర్వహించిన రథోత్సవ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి, బీజేపీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ఉత్సవాలకు హాజరయ్యారు. మూడేళ్ల క్రితం అధికార పార్టీ నేతలతోపాటు ప్రతిపక్ష పార్టీ నేతలు కలిసి సామరస్యంగా నిర్వహించుకునే వారు. రెండేళ్లుగా ఉత్సవాలలో రాజకీయ నేతల మధ్య ఉత్సవాలలో ఆదిపత్యపోరు మొదలైంది. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కుటుంబ సమేతంగా 10 మంది వరకు వచ్చారు. మరోవైపు బీజేపీ నేత మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. రథం ఎదుట ప్రముఖులంతా ఒకే చోట ఆసీనులయ్యారు. తర్వాత పూర్ణకుంభం ముగించి రథానికి మహామంగళ హారతి ఇచ్చేందుకు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీలు, స్థానిక ప్రజా ప్రతినిధులు హారతి ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. హారతి పళ్లెం పట్టుకున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డిని మనోహర్‌రెడ్డి సోదరుడు నెట్టేయడంతో తోపులాట చోటు చేసుకొంది. దీంతో అవమానంతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఉత్సవాల మధ్య నుంచే నిష్క్రమించారు. ఇదిఇలా ఉండగా మరోవైపు దశాబ్దాలుగా వీరశైవ సమాజం ఆధ్వర్యంలోనే జాతర ఉత్సవాల క్రతువు కొనసాగుతోంది. అయితే ఈ సారి వీరశైవ సమాజం ప్రముఖులకు ఉత్సవాలలో సరైన గౌరవం దక్కలేదని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ అధికారి శేఖర్‌గౌడ్ సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయని విమర్శించారు.

బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

ఎంపీపీ, ముగ్గురు ఎంపీటీసీలతో సహా కాంగ్రెస్‌లో చేరిన నేతలు



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

దౌల్తాబాద్: మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఎంపీపీ విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు ప్రమోద్‌రావు, మాజీజెడ్పీటీసీ మోహన్ రెడ్డి, మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ సుజాత, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డితో సహా ముగ్గురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు సుమారు వెయ్యి మంది కార్యకర్తలు ఆదివారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సీఎం సొంత నియోజకవర్గం కావడంతో ఆ పార్టీ చేరికలపై దృష్టి పెట్టడంతో మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు ముఖ్యనాయకులు కార్యకర్తలు 100 వాహనాల్లో హైదరాబాద్ వెళ్లి రేవంత్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మండలం నుంచి 10వేల మెజార్టీ తీసుకువచ్చేలా కృషి చేయాలని సూచించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకట్రావు, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, వీరన్న, సత్యపాల్, ఎంపీటీసీ దస్తప్పమంజుల తదితరులు పాల్గొన్నారు.

సరదాగా వెళ్లి.. నీట మునిగి



గల్లంతైన బాలుర కోసం గాలిస్తున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది

జల్‌పల్లి చెరువులో ఇద్దరి బాలుర గల్లంతు

పహాడీషరీఫ్: చేపలు పట్టేందుకు వచ్చి చెరువులో ఇద్దరు బాలురు గల్లంతైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీ బార్కాస్, ఎర్రకుంట ప్రాంతాలకు చెందిన అబ్దుల్ వాహెద్(14), ఉస్మాన్ నహదీ(16), హఫీజ్, వసీం, అబుబకర్ నహదీ అనే ఐదుగురు స్నేహితులు సెలవులు కావడంతో ఆదివారం సరదాగా చేపలు పట్టేందుకు జల్‌పల్లి పెద్ద చెరువుకు వచ్చారు. వాదే ముస్తఫా బస్తీ వైపు ఉన్న చెరువు ఒడ్డున బండరాళ్లపై కూర్చొని కర్రలకు గాలం చేసి చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో వాహెద్ గుండు పైనుంచి చెరువులోకి పడిపోయాడు. పక్కనే ఉన్న నహదీ, హఫీజ్‌లు అతన్ని రక్షించేందుకు లోనికి దూకారు. చెరువు లోతుగా ఉండడంతో వాహెద్, నహదీలు నీట మునిగారు. ఈత వచ్చిన హఫీజ్ అతికష్టం మీద బయట పడ్డాడు. వెంటనే స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానిక ఈతగాళ్లతో ప్రయత్నించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో, ఫైర్ సిబ్బందిని రప్పించారు. సాయంత్రం 7 గంటల వరకు ఫైర్ సిబ్బంది ప్రయత్నించినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం తిరిగి గాలింపును ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు.

నీటికుంట.. ప్రయోజనమేనంటా

- పాం పాండ్స్‌తో పెరగనున్న భూగర్భ జలాలు
- నిర్మాణానికి ప్రభుత్వ ప్రోత్సాహకం



పాం పాండ్స్ కోసం చేపట్టిన పనులను పరిశీలిస్తున్న అధికారి

కేశంపేట: పంట పొలాల్లో వర్షం నీటిని నిల్వ చేసేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా నీటికుంట(పాం పాండ్స్)ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఈ పథకం కింద రైతు ఆసక్తిని బట్టి కూలీలతో పాం పాండ్స్‌ను నిర్మించుకుంటే ప్రభుత్వం డబ్బును సైతం అందిస్తుంది. ఈ మేరకు అన్నదాతలు నీటి కుంటల నిర్మాణానికి ఆసక్తి కనబరుస్తున్నారు.

అధికారులే వచ్చి..

ఫారం పాండ్స్‌ల నిర్మాణం కోసం రైతులు ఆసక్తిని చూపిస్తే ఈజీఎస్ అధికారులు క్షేత్రానికి వచ్చి అనువైన స్థలాన్ని ఎంపిక చేస్తారు. రైతు పొలంలో పల్లపు ప్రదేశాన్ని ఎంచుకుంటే వర్షాలకు పడిన నీరంతా ఒకే వైపునకు వచ్చి నీటి కుంట నిండుతుంది. పొలంలో భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి ఫారం పాండ్స్ ఎంతగానో ఉపయోగపడుతాయి. నీటి కుంటలను రైతుల పొలాలను బట్టి గతంలో ఐదు రకాలుగా ఉండగా ప్రస్తుతం మూడు రకాలుగా నిర్మించుకోవచ్చు. 8 మీటర్ల పొడవు, వెడల్పుతో రెండు మీటర్ల లోతు మేర మొదటి రకం నీటి కుంట. 12 మీటర్ల పొడవు, వెడల్పుతో రెండు మీటర్ల లోతు మేర రెండో రకం. 20 మీటర్ల పొడవు, వెడల్పుతో మూడు మీటర్ల లోతు మేర మూడో రకం అందుబాటులో ఉంది.

ఆర్థిక తోడ్పాటు

పంట చేనులో నీటి కుంటలను నిర్మించుకుంటే వర్షం నీరు నిలిచి ఉంటుంది. ఈ నీటిని రైతు పశువులకు తాగునీరు అందించడానికి ఉపయోగపడుతుంది. అవసరం అనుకుంటే పంటలకు కూడా నీటిని అందించవచ్చు. కొద్దిపాటిగా కూరగాయాలను కూడా సాగుచేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగవచ్చు. నీరు నిలిచి ఉండటంతో పరిసరాల్లో భూగర్భ జలాల పెరుగుదల అమోఘంగా ఉంటుంది.

ముందుకు రావాలి



నీటి కుంటల నిర్మాణానికి రైతులు ముందుకు రావాలి. రైతుకు జాబ్‌కార్డు ఉండి ఫారంపాండ్స్ నిర్మించుకోవాలని ఆసక్తి ఉంటే ఈజీఎస్ ద్వారా గ్రామాల్లో సభలు నిర్వహిస్తాం. అందులో దరఖాస్తు చేసుకుంటే స్థలాన్ని పరిశీలించి మంజూరు చేస్తాం. ఉపాధి కూలీల ద్వారా ఫారంపాండ్స్‌ను నిర్మిస్తాం.

– అజీజ్, ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీఓ, కేశంపేట

నీటి కుంటలు నిర్మించుకోవాలి



రైతులు తమ వ్యవసాయ పొలాల్లో నీటి ఎద్దడి లేకుండా చేయాలంటే వర్షపు నీటిని సక్రమంగా వినియోగంలోకి తీసుకురావాలి. అందుకోసమే ఫారంపాండ్స్‌ను నిర్మించుకునేందుకు ముందుకు వస్తే ప్రభుత్వమే నిర్మిస్తుంది. దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయి.

– మక్బూల్, రైతు, నిర్దవెల్లి, కేశంపేట

మండే ఎండకు.. కారు అద్దాలు పగిలి




జాజుగుట్ట వద్ద పగిలిన కారు అద్దాలు

చేవెళ్ల: వేసవి ఎండలు మండిపోతున్నాయి. వీటి తీవ్రతకు మండలంలో ఓ కారు అద్దాలు పగిలిపోయాయి. ఈ సంఘటన ఇబ్రహీంపల్లి అనుబంధ గ్రామమైన జాజుగుట్టలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అహ్మద్ తన కారును ఇంటి పక్కనే పార్కు చేశాడు. ఆదివారం మధ్యాహ్నం ఎండ వేడికి కారు వెనక అద్దాలు పగిలిపోయాయి. అద్దం పగిలిన శబ్దం రావటంతో బయటకు వచ్చి చూసిన వారికి ఏమి జరిగిందో అర్థం కాలేదు. ఎవరూ లేరు అద్దాలు ఎలా పగిపోయాయాని చూశారు. కాసేపటికి ఎండ వేడికి పగిలిపోయినట్లు స్థానికులు గుర్తించారు. దీంతో భయాందోళనలో గ్రామస్తులు ఉన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాలు సీజ్

కేశంపేట: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేసిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములనర్వ గ్రామ శివారులోని చెరువు నుంచి మట్టిని తరలిస్తున్న జేసీబీ, టిప్పర్లను పోలీసులు గుర్తించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలించడంతో వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై కానిస్టేబుల్ రవి ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్ కొమురయ్య, జేసీబీ డ్రైవర్ పవన్‌లతో పాటు వాహన యజమానులపైన కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ లింగం ఆదివారం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నర్సింగ్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ నయీమొద్దీన్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కటిక నర్సింగ్(38) మాంసం దుకాణాన్ని నిర్వహిస్తూ కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావడం, గ్రామంలో ప్లాటు కొనడంతో నర్సింగ్ అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపం చెందిన నర్సింగ్ ఈ నెల 2న ఇంట్లో గుళికల మందు తిని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అదేరోజు షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం నర్సింగ్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

- బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మల్లేశ్‌ను ఆశీర్వదించండి
- పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి మల్లేశ్

యాచారం: స్థానికుడు బడుగు, బలహీన వర్గాలకు చెందిన నేత, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భువనగిరి ఎంపీగా గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి కిషన్‌రెడ్డి ర్యాలీ నిర్వహించారు. అభ్యర్థి మల్లేశ్‌తో కలిసి ఆయన యాచారంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ భువనగిరి ఎంపీ అభ్యర్థిగా మల్లేశ్‌కు అవకాశం కల్పించారన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలు అతడిని ఆశీర్వదించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 5 నెలలకే ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం కోసం అనేక హామీలిచ్చి ఇవాళ అమలు చేయలేక చేతులు ఎత్తేశారని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందే పరిశ్రమలన్నీ ఈ నియోజకవర్గంలో ఏర్పాటైనట్లు చెప్పారు. పదేళ్లలో రూ.3 వేల కోట్లకు పైగా నిధులతో అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. అభివృద్ధి చేయాలంటే ఒక్క బీఆర్‌ఎస్‌కే సాధ్యమన్నారు. అనంతరం మల్లేశ్ మాట్లాడుతూ, భువనగిరి ఎంపీగా గెలిపిస్తే ప్రజాసేవ చేసుకుంటానన్నారు. ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అభివృద్ధికి చిరునామా బీఆర్‌ఎస్ అని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి బాషా, గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.